"మనోరమకా ?"

మూర్తి ముఖం చిట్లించుకున్నాడు.

"అంతేనా ?"

కోపంలో పేజీ త్రిప్పబోయి దాన్ని చింపాడు మూర్తి.

"ఎవరికయితే నా కెందుకులెండి !" అన్నది సుగుణ విషాదంగా.

"అలా అని ఊరుకోరాదూ, ఊరికే నన్ను చంపకపోతే !" పేపరు మడిచి బల్లమీద పారేస్తూ కసురుకున్నాడు మూర్తి. సుగుణకళ్లు చెమ్మగిల్లాయి. భర్తముందు ఆమెకళ్లు చెమ్మగిల్లటం, ఆమె కాపరానికి వెళ్ళి రెండేళ్ళలో ఇది ఎన్నోసారో ! అతని హృదయంలో ఆమె కన్నీళ్లకి విలువలేదు. లేదని ఆమెకికూడా తెలుసు. తెలిసినందువల్లే ఆమెకళ్లు మరింతగా చెమ్మగిల్లటం, తరవాత వాటంతటవి ఆరిపోవటం. ప్రక్కకి తిరిగి, కన్నీళ్ళకి తుడుచుకుంటూ అందామె విషయం మారుస్తూ.

"అబ్బాయిని చూశారా ?"

"ఊఁ"

"ఎవరి పోలిక ?"

"ఏమో"

"అంతా మీ పోలికేనంటున్నారు"

"ఊఁ హూఁ"

"ఆ కళ్ళూ ముక్కూ అంతా మీ పోలికే"

పాపాయివేపు చూశాడు మూర్తి. ఆ చూపుని చూసి సుగుణ మురిసిపోయింది. సంతోషంలో పొరపాటున ఒక చెణుకు విసిరింది. తన స్వభావాని కనుగుణంగా.

"రూపులో మీ పోలికొచ్చినా, బుద్ధిలోనైనా రాకుండా ఉంటే బావుండును"

"నీకు నేనంటే అంత అసహ్యమన్నమాట" కోపంతో మూర్తి ముఖం ఎఱ్ఱబడ్డది.

సుగుణకి గుండె గతుక్కుమంది. క్షమాపణ కోరుకుంటున్నట్టుగా అన్నది వణికే కంఠంతో.

"తమాషాగా అన్నానండీ"

